A1TV NEWS

# ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

సంచిక :01 సంపుటి : 61జూ బుధవారం - 30-ఆగస్ట్ - 2023 పేజీలు 4. వేల :4 /

## సిఎం జగన్‌తో నావికాదళ కమాండర్ భేటీ

అమరావతి,ఆగస్ట్29

సీఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని తూర్పు నావికా దళం ఫ్లాగ్ ఆఫీసర్ కమాండింగ్ ఇన్ ఛీఫ్, వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్ (ఏవీఎస్ఎమ్, విఎస్ఎమ్) మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల ఈఎన్‌సీ ఛీఫ్‌గా రాజేష్ పెంధార్కర్ బాధ్యతలు స్వీకరించారు. ఈ క్రమంలో మంగళవారం క్యాంప్ ఆఫీసులో సీఎం జగన్ తో రాజేష్ పెంధార్కర్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా సీఎం వైఎస్ జగన్ రాజేష్ పెంధార్కర్‌ను సన్మానించి, శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ప్రతిమ అందజేశారు. తూర్పు సముద్ర తీరంలో సముద్ర భద్రతకు సంబంధించి తలెత్తుతున్న సవాళ్ళను అధిగమించేందుకు భారత నావికాదళం చేపట్టిన వివిధ కార్యక్రమాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు వివరించారు వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్. తూర్పు నౌకాదళ కమాండ్ (ఈఎన్‌సీ) ఆధ్వర్యంలో వచ్చే ఫిబ్రవరిలో బహుపాక్షిక నావికా విన్యాసమైన మిలన్ 2024 కు విశాఖపట్నం నగరం ఆతిథ్యం ఇవ్వనుంది. 57 దేశాల నుంచి ప్రముఖులు, నౌకాదళాల భాగస్వామ్యం ఉంటుందని అంచనా, మిలన్ 2024 విశేషాలను సీఎం జగన్ తో పంచుకున్న వైస్ అడ్మిరల్, అడ్మినిస్ట్రేన్ అంశాలపై కూడా సమావేశంలో చర్చించారు. సీఎం వైఎస్ జగన్‌కు ఐఎన్ఎస్ విశాఖపట్నం షిప్ మోడల్‌ను బహుకరించారు కమాండింగ్ ఇన్ ఛీఫ్, వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్. ఈ సందర్భంగా నేవీ ఉన్నతాధికారులు కెప్టెన్ విఎస్‌సి రావు (సివిల్ మిలటరీ లైజన్ (అడ్వైజరీ), కెప్టెన్ రోహిత్ కట్టోజు,



కమాండర్ వైకె కిషోర్, లెఫ్టినెంట్ సాయికృష్ణ సీఎం జగన్ ను కలిసిన వారిలో ఉన్నారు.

## ఏపీలో గ్రూప్-1, గ్రూప్-II భర్తీకి నోటిఫికేషన్ విడుదల.

ఆంధ్ర ప్రగతి అమరావతి ఆగస్టు 29:

ఏపీ లో గ్రూప్-1 లో 89, గ్రూప్-2 కు సంబంధించి 508 ఖాళీల భర్తీకి అనుమతులు మంజూరు చేసింది.

గ్రూప్-1 కు సంబంధించి హోం శాఖలో అత్యధికంగా 27 ఖాళీలు ఉన్నాయి.

ఇందులో డీఎస్పీకి సంబంధించి 25,

డిప్యూటీ సూపరింటెండ్ ఆఫ్ జైల్స్-01,

డిప్యూటీ ఫారెస్ట్ ఆఫీసర్-1 ఖాళీలు ఉన్నాయి.

రెవెన్యూ డిపార్ట్మెంట్ లో 44 ఖాళీలు ఉన్నాయి.

ఆర్థిక శాఖలో 8 ఖాళీలు ఉన్నాయి.

మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో 01 ఖాళీ ఉంది.

ఇంకా గ్రూప్-2 విషయానికి వస్తే.. ఇంకా గ్రూప్-2 ఖాళీల విషయానికి వస్తే అత్యంగా అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ పోస్టులు 161 ఉన్నాయి.

ఎక్సైజ్ సబ్ ఇన్స్పెక్టర్ పోస్టులు 150,

డిప్యూటీ తహసీల్దార్ 114,

అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ 18,

సబ్ రిజిస్ట్రార్ 16,

మున్సిపల్ కమిషనర్ పోస్టుల విభాగంలో 04 ఖాళీలు ఉన్నాయి.

## ఇమ్రాన్ ఖాన్ కు భారీ ఊరట..

### - మూడేళ్ల జైలు శిక్ష నిలిపివేత!

పాకిస్థాన్ మాజీ ప్రధానమంత్రి ఇమ్రాన్ ఖాన్ కు అతిపెద్ద ఊరట లభించింది. తోషాఖానా కేసులో ట్రయల్ కోర్టు విధించిన మూడేళ్ల జైలు శిక్షను ఇస్లామాబాద్ హైకోర్టు నిలిపివేసింది. తనకు పడ్డ శిక్షను రద్దు చేయాలంటూ ఇమ్రాన్ ఖాన్ దాఖలు చేసిన పిటిషన్ ను విచారించిన హైకోర్టు ఈరోజు తీర్పును వెలువరించింది. ఇమ్రాన్ కు బెయిల్ మంజూరు చేసింది. మరోవైపు ఇమ్రాన్ ప్రస్తుతం పంజాబ్ ప్రావిన్స్ లోని అటోక్ జిల్లా జైల్లో శిక్షను అనుభవిస్తున్నారు. కోర్టు ఆదేశాల నేపథ్యంలో జైల్లో ఆయనకు ప్రత్యేక సదుపాయాలను కల్పించారు. తాజాగా హైకోర్టు తీర్పుతో ఇమ్రాన్ ఖాన్ జైలు నుంచి విడుదల కానున్నారు.



## తెలంగాణలో పోటీ, పొత్తులపై చంద్రబాబు కీలక ప్రకటన

ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో పోటీ, పొత్తులపై టీడీపీ అధినేత చంద్రబాబు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలో టీడీపీ ఒంటరిగానే పోటీ చేస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఇక్కడ పొత్తులపై చర్చించేందుకు సమయం మించిపోయిందని చెప్పారు. తెలంగాణలో ఎన్ని స్థానాల్లో, ఏయే స్థానాల్లో పోటీ చేయాలనే విషయాన్ని కమిటీ నిర్ణయిస్తుందని అన్నారు. ఆంధ్రప్రదేశ్ లో అవసరాలను బట్టి పొత్తులు ఉంటాయని చెప్పారు. మరోవైపు ఏపీలో టీడీపీ, జనసేనలు కలిసి పోటీ చేసే సంకేతాలు కనిపిస్తున్నాయి. ఈ కూటమిలో బీజేపీ కూడా ఉంటుందనే ప్రచారం జరుగుతున్నప్పటికీ... ఆ పార్టీ నుంచి ఇప్పటి వరకు ఎలాంటి స్పందన రాలేదు.



### ఆంధ్రప్రదేశ్ పాలకుడికి ఎలాగూ తెలుగు అంటే ఆసక్తి లేదు...

## భాషను ప్రజలే కాపాడుకోవాలి



నేడు తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ ఓ ప్రకటన ద్వారా స్పందించారు. తెలుగు భాషను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పిలుపునిచ్చారు. మాట్లాడే భాష, రాసే భాష ఒకటి కావాలని తపించి, ఆ దిశగా వ్యావహారిక భాషోద్యమాన్ని నడిపిన గిడుగు వెంకటరామమూర్తి గారిని తెలుగు జాతి ఎన్నడూ మరువకూడదని తెలిపారు. గ్రాంథిక భాషలో ఉన్న తెలుగు వచనాన్ని ప్రజల భాషలోకి తీసుకువచ్చి మన మాతృ భాషకు జీవం పోసిన వ్యక్తి గిడుగు అని కొనియాడారు. నేడు తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా గిడుగు వెంకటరామమూర్తి గారికి అంజలి ఘటిస్తున్నానని వివరించారు. "ఆంధ్రప్రదేశ్ పాలకుడికి ఎలాగూ తెలుగు అంటే ఆసక్తి లేదు. కాబట్టి ప్రజలే తెలుగు భాషను కాపాడుకునే బాధ్యతను స్వీకరించాలి. తెలుగు భాష అభివృద్ధి కోసం ఏర్పాటైన ప్రభుత్వ విభాగాల పనితీరును గురించి ఎంత తక్కువ చెప్పుకుంటే అంత మంచిది. వారు విడుదల చేసే ప్రకటనల్లోనూ, విద్యాశాఖ నుంచి వచ్చే ప్రకటనల్లోనూ ఎన్ని అక్షర దోషాలు ఉంటున్నాయో చూస్తేనే తెలుస్తుంది. అలాంటి వారి నుంచి భాషా వికాసాన్ని ఆశించలేం. వ్యావహారిక భాషోద్యమానికి మూల పురుషుడైన గిడుగు వెంకటరామమూర్తి గారి స్ఫూర్తిని తెలుగు భాషాభిమానులు, అధ్యాపకులు, సాహితీవేత్తలు అందిపుచ్చుకోవాలి. చిన్నారులు ఓనమాలు నేర్చుకునే దశ నుంచే మన మాతృభాషను దూరం చేసే విధంగా ఉన్న పాలకుల తీరు వల్ల కలిగే అనర్థాలను ప్రజలకు అర్థమయ్యేలా చెప్పాలి" అని పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు.



## గ్యాస్ సిలిండర్ ధరను భారీగా తగ్గించిన కేంద్రం..

### వారికైతే ఏకంగా రూ. 400 తగ్గింపు!

ఆకాశాన్నంటుతున్న వంట గ్యాస్ సిలిండర్ ధరలను కేంద్ర ప్రభుత్వ భారీగా తగ్గించింది. ఒక్కో సిలిండర్ పై రు. 200 తగ్గిస్తూ కేంద్ర కేబినెట్ నిర్ణయించింది. ఉజ్వల పథకం ద్వారా గ్యాస్ సిలిండర్ పొందిన వారికి కేంద్రం అదనంగా భారీ రాయితీని ప్రకటించింది. వీరికి మరో రూ. 200 తగ్గించింది. అంటే ఈ స్కీమ్ కింద ఉన్నవారికి ఒక్కో సిలిండర్ కు రూ. 400 తగ్గిందన్నమాట. రక్షా బంధన్ సందర్భంగా దేశంలోని మహిళలకు ప్రధాని మోదీ ఇస్తున్న బహుమతి ఇదని కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్ తెలిపారు. ఉజ్వల పథకం ద్వారా మరో 75 లక్షల మందికి ఉచితంగా గ్యాస్ కనెక్షన్లను ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు

### రెండ్రోజుల్లో జమ్ము కాశ్మీర్ హోదాపై

## కేంద్రం కీలక ప్రకటన!



జమ్ము, కాశ్మీరను రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా విభజించడం తాత్కాలిక చర్య మాత్రమేనని కేంద్ర ప్రభుత్వం భారత సర్వోన్నత న్యాయస్థానానికి తెలిపింది. భవిష్యత్తులో జమ్ముకు మళ్లీ రాష్ట్ర హోదాను కల్పిస్తామని తెలిపింది. అయితే రాష్ట్ర హోదాను పునరుద్ధరించేందుకు రోడ్ మ్యాప్‌ను సిద్ధం చేయాలని మంగళవారం కేంద్రానికి సుప్రీంకోర్టు సూచించింది. జమ్ము, కాశ్మీర్ రాష్ట్రానికి ప్రత్యేక అధికారాలు కలిగిన ఆర్టికల్ 370 రద్దును సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారిస్తోంది. 2019లో 370ని రద్దు చేసి జమ్ము, కాశ్మీర్ రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా చేశారు. తాజాగా, విచారణ సందర్భంగా కేంద్రం తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. జమ్మూ కాశ్మీర్‌ను జమ్ము కాశ్మీర్, లడఖ్ కేంద్రపాలిత ప్రాంతాలుగా విభజించామని, ఇది తాత్కాలికమేనని కోర్టుకు తెలిపారు. భవిష్యత్తులో జమ్ము కాశ్మీర్ రాష్ట్రంగా మారుతుందని, లడఖ్ కేంద్రపాలిత ప్రాంతంగానే ఉంటుందని స్పష్టం చేశారు. ఆగస్ట్ 31న అత్యున్నతస్థాయి సమావేశం తర్వాత సానుకూల ప్రకటన వస్తుందన్నారు. జమ్ము కాశ్మీర్‌కు సంబంధించి ఎల్లుండి కీలక ప్రకటన వెలువడుతుందన్నారు. జమ్ము కాశ్మీర్‌కు రాష్ట్ర హోదా కల్పించాలనే అంశం ప్రస్తుతం పార్లమెంట్‌లో ఉందన్నారు. మెహతా వాదనలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం... ఇలా తాత్కాలికం ఎంత కాలమని, జమ్ము కాశ్మీర్‌లో ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారని ప్రశ్నించింది. దీనికి సంబంధించి రోడ్డు మ్యాప్ ఉందా? ఆ రోడ్డు మ్యాప్ మా ముందు పెట్టాలని పేర్కొంది. మీరు ఒక రాష్ట్రాన్ని కేంద్రపాలిత ప్రాంతంగా ఎలా మార్చగలరు? అలాగే ఇది ఎంతకాలం కొనసాగుతుంది? కోర్టుకు స్పష్టం చేయాలని తెలిపింది. ఇక్కడ ప్రజాస్వామ్య పునరుద్ధరణ ముఖ్యమని స్పష్టం చేసింది.ఆర్టికల్ 370 రద్దు తర్వాత 2020లో జమ్ము కాశ్మీర్‌లో మొదటిసారి డిస్ట్రిక్ట్ డెవలప్‌మెంటల్ కౌన్సిల్ (డీడీసీ) ఎన్నికలు జరిగాయని తుషార్ మెహతా కోర్టుకు తెలిపారు. ఆర్టికల్ 370 రద్దుకు ముందు, ఆ తర్వాత హర్తాల్‌లు, దాడులు కొనసాగాయని తెలిపారు. అయితే ఇప్పుడు అంతా సాధారణ పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ఈ క్రమంలో జమ్ము కాశ్మీర్‌కు తిరిగి రాష్ట్ర హోదాను కల్పిస్తామన్నారు.

# ఇక నుండి సచివాలయాల్లోనే ఓపెన్ టెన్త్, ఇంటర్ అడ్మిషన్లు.

ఆంధ్ర ప్రగతి అమరావతి ఆగస్టు 29:

చదువుకోవాలని ఆశ ఉన్నా.. వివిధ కారణాల వల్ల బడి ఈడు దాటిపోయిన వారికోసం ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం ద్వారా ఓపెన్ టెన్త్, ఇంటర్‌కు అవకాశం కల్పిస్తుంది. 14 ఏళ్లు దాటిన వారు నేరుగా అడ్మిషన్లు తీసుకుని టెన్త్ లేదా ఇంటర్ పరీక్షలకు హాజరుకావచ్చు. వివిధ కారణాలతో బడికి వెళ్లలేకపోయినా, చదువు మధ్యలో మానేసిన వారికి ఓపెన్ టెన్త్, ఓపెన్ ఇంటర్ మంచి అవకాశంగా అధికారులు చెబుతున్నారు. అయితే ఆయా తరగతుల్లో ప్రవేశాలకు ఇప్పటివరకూ ఆన్ లైన్‌లో మాత్రమే దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది.టెన్త్ లేదా ఇంటర్‌కు అప్లై చేసుకుని అడ్మిషన్ తీసుకోవలసి ఉంటుంది. ఏడాదికి రెండుసార్లు పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఎలాంటి చదువులేని వారు కూడా నేరుగా పదో తరగతి అడ్మిషన్ తీసుకోవచ్చు. ఇక టెన్త్ పాసయిన వారు ఓపెన్ ఇంటర్ అడ్మిషన్ తీసుకునే అవకాశం ఉంది. తాజాగా ఓపెన్ టెన్త్, ఓపెన్ ఇంటర్ అడ్మిషన్లు తీసుకోనే వారికోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరో అవకాశం కల్పించింది. నేరుగా సచివాలయాల్లోనే రిజిస్టర్ చేసుకుని అడ్మిషన్ తీసుకునే అవకాశం కల్పించింది.ఓపెన్ టెన్త్, ఓపెన్ ఇంటర్ అడ్మిషన్ ఎలా తీసుకోవాలి ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం ద్వారా ఓపెన్ టెన్త్, ఓపెన్ ఇంటర్ అడ్మిషన్ తీసుకోవలసి ఉంటుంది. దీనికోసం ఓపెన్ స్కూల్ సొసైటీ వెబ్ సైట్ లో దరఖాస్తు చేసుకోవలసి ఉంటుంది. ఈ విద్యాసంవత్సరంలో ఇప్పటికే ప్రవేశాల ప్రక్రియ ప్రారంభం అయింది. ఎలాంటి అదనపు ఫీజు లేకుండా దరఖాస్తు చేసుకునేందుకు సెప్టెంబర్ 15 వ తేదీ వరకూ గడువు ఉంది. అదనపు రుసుంతో కలిపి అక్టోబర్ 5వ తేదీ వరకూ అడ్మిషన్ల కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే ఇప్పటివరకూ కాస్త కంప్యూటర్ నాలెడ్జి ఉన్నవారు మాత్రమే అడ్మిషన్ల కోసం నేరుగా దరఖాస్తు చేసుకునేవారు. మిగిలిన వారు ఇంటర్ నెట్ సెంటర్ కు వెళ్లాల్సి వచ్చేది. అయితే ఈ ఏడాది నుంచి గ్రామ, వార్డు సచివాలయాల్లో కూడా అడ్మిషన్లు పొందేలా ఏర్పాట్లు చేసారు. దీనికోసం గ్రామ, వార్డు సచివాలయాల శాఖతో ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక పీఠం ఒప్పందం చేసుకుంది. సార్వత్రిక పీఠం ద్వారా పదో తరగతి,టెన్త్ అడ్మిషన్లు తీసుకోవాలనుకునే వారు దగ్గర్లోని గ్రామ లేదా వార్డు సచివాలయానికి వెళ్లి దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు తెలిపారు.




ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షల కోసం మొదటిసారి ఆన్ లైన్‌లో ఫ్రీ కోచింగ్ పదో తరగతి, ఇంటర్ అడ్మిషన్ల కోసం దరఖాస్తు చేసుకున్న తర్వాత ఆన్ లైన్ లోనే వాటిని పరిశీలించి అర్హులైన వారికి అడ్మిషన్లు ఇస్తారు. ఇలా అడ్మిషన్లు పొందిన వారికోసం ఈ ఏడాది ఓపెన్ స్కూల్ సొసైటీ అఫీషియల్ వెబ్ సైట్ లో ఆన్ లైన్ పాఠాల బోధన వీడియోలను ఉంచనున్నట్లు సార్వత్రిక పీఠం అధికారులు తెలిపారు. ఈ పాఠాలను నేర్చుకోవడం ద్వారా పరీక్షలకు హాజరుకావడం సులువుగా ఉంటుందని అధికారులు చెబుతున్నారు.



# గురు రాజలో ఘనంగా తెలుగు భాషా దినోత్సవ వేడుకలు.

ఆంధ్ర ప్రగతి నంద్యాల ఆగస్టు 29:

నంద్యాల పట్టణం ఎన్జీవో కాలనీ నందుగల శ్రీ గురుగాజ ఇంగ్లీష్ మీడియం స్కూల్ నందు తెలుగు భాషా దినోత్సవవేడుకలు ఘనంగా నిర్వహించినట్లుగా డైరెక్టర్ షేక్షావలి రెడ్డి తెలిపారు వాడుక భాష యోధుడు వ్యవహారిక భాష పితామహుడు శ్రీ గిడుగు వెంకట రామమూర్తి పంతులు గారి జయంతిని పురస్కరించుకొని పాఠశాల ఆవరణలో తెలుగు భాషా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాము. విద్యార్థులలో భాషాభిరుచిని, సృజనాత్మకతను వెలికి తీయడానికి అంతర్ పాఠశాలలో భాగంగా జూనియర్స్ విభాగంలో లేఖారచన సీనియర్స్ భాగంలో కవితా రచన పోటీలో నిర్వహించడమైనది. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు రామాయణం భాగవతం పంచతంత్రం విద్యార్థి కల్పవృక్షం పుస్తకాలను డైరెక్టర్ షేక్షావలి రెడ్డి బహుమతులు అందజేసి విద్యార్థుల ప్రతిభాపాటవాలను ప్రశంసించారు. తెలుగు తల్లి చిత్రపటానికి పూలమాలవేసి వందన సమర్పణ గావించారు.

# సాగునీటి ప్రాజెక్టులపై సిపిఐ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి సదస్సు.

- సెప్టెంబరు ఒకటిన వస్తున్న బస్సు జాతకు ఘనంగా స్వాగతం పలకాలి...

- కరపత్రాలను విడుదల చేసిన సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కే రామాంజనేయులు, జిల్లా కార్యదర్శి ఎన్. రంగనాయుడు

ఆంధ్ర ప్రగతి నంద్యాల ఆగస్టు 29: సాగునీటి ప్రాజెక్టులపై నంద్యాలలో సిపిఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి సదస్సును జయప్రదం చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కే. రామాంజనేయులు, జిల్లా కార్యదర్శి ఎన్.రంగనాయుడు పిలుపునిచ్చారు. సిపిఐ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో ఈనెల 17 నుండి ప్రజా కార్మిక, కర్షక సమస్యల పరిష్కారం కొరకు ప్రారంభమైన బస్సుజాత సెప్టెంబర్ ఒకటిన నంద్యాలకు రానున్న సందర్భముగా సిపిఐ కార్యాలయంలో పార్టీ నాయకులతో కలిసి కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రాన్ని రక్షించండి, దేశాన్ని కాపాడండి అన్న నినాదంతో బస్సు యాత్ర సాగుతుందని, రాయలసీమ నీటిపారుదల ప్రాజెక్టులపై సెప్టెంబర్ 1న నంద్యాలలో రాష్ట్రస్థాయి సదస్సు జరుగుతుందని వివరించారు. నిత్యం కరువులతో తల్లడిల్లుతున్న రాయలసీమలో నీటిపారుదల ప్రాజెక్టులు పూర్తి చేసి ప్రతి ఎకరాకు సాగునీరు, ప్రతి గ్రామానికి త్రాగునీరు అందించి కరువు నుండి శాశ్వతంగా విముక్తి చేసి తన తండ్రి ఆశయాలను నిర్వహిస్తానని చెప్పిన సీఎం జగన్ నాలుగున్నర సంవత్సరాల పాలనలో ఒక ప్రాజెక్టు కూడా పూర్తిచేసి అదనంగా ఒక ఎకరా ఆయకట్టుకు




కూడా నీరు అందించలేకపోయారని ఆరోపించారు. రాయలసీమ ప్రాజెక్టులు పూర్తి చేయకపోగా కేంద్రంలో ఉన్న బిజెపి రాయలసీమ రైతాంగ వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్నా పల్లెత్తు మాట మాట్లాడడం లేదన్నారు. రాయలసీమ ప్రజానీకం రాయలసీమకు రాష్ట్ర రాజధాని, కృష్ణ నీటి కేటాయింపుల్లో ప్రాధాన్యత కల్పించాలని, 1937లో పెద్ద మనుషులు చేసుకున్న శ్రీబాగ్ ఒప్పందం అమలుకు నోచుకోలేదన్నారు. 1951లో కృష్ణ, పెన్నార్ ప్రాజెక్టు అనుమానాలు, అపోహలతో అటకెక్కించబడిందని, 1953లో కర్నూలులో ఏర్పాటయిన రాష్ట్ర రాజధాని 1956లో హైదరాబాద్ కు మార్చారని,బళ్ళారి కర్ణాటకలో కలపడం వల్ల తుంగభద్ర జలాశయం కోల్పోయామన్నారు. నీటి వివాదాలపై ఏర్పాటయిన బచావత్ ట్రిబ్యునల్ వల్ల నికర జలాలు కొల్పోయామని, బ్రజేష్ కుమార్ ట్రిబ్యునల్ వల్ల మిగులు జలాలు కూడా కోల్పోయే ప్రమాదం ఏర్పడిందన్నారు. హక్కులు, అవకాశాలను కోల్పోయి దగాపడి వెనుకబడ్డ రాయలసీమలో తగినంత వర్షపాతం నమోదు కావడం లేదని, ఏడాదికేడాది కరువు పీడత మండలాల సంఖ్య పెరుగుతుందే తప్ప తగ్గడం లేదన్నారు. అనంతపురం జిల్లాలో ఇప్పటికే సాగు భూమి పంటలకు నోచుకోక ఎడారి ఛాయలు అలుముకుంటున్నాయని అన్నారు. సెప్టెంబర్ 1న మున్సిపల్ టౌన్ హాల్లో జరిగే రాష్ట్రస్థాయి సదస్సులో సభాధ్యక్షులుగా ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రయ్య పాల్గొంటారని,

# ఎల్ కె ఆర్ వరల్డ్ స్కూల్లో ఘనంగా తెలుగు బాషా దినోత్సవం




ఆంధ్ర ప్రగతి నంద్యాల ఆగస్టు 29:

సాహిత్య సౌరభాలతో విరాజిల్లే తెలుగు పసిడి వెన్నెల భాష అని మాతృభాష పరిరక్షణ సమితి అధ్యక్షులు డాక్టర్ హయగ్రీవాచార్యులు పేర్కొన్నారు..

తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా ఎల్.కే ఆర్ గ్లోబల్ స్కూల్ లో "మాతృభాషకు వందనం" అనే అంశంపై చర్చ, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు... పాఠశాల కరస్పాండెంట్ జె. లక్ష్మీకాంతరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపల్ సనత్ కుమార్ తెలుగు పండిట్ అన్నెం శ్రీనివాస రెడ్డి, ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత శేషఫణి తదితరులు పాల్గొని ప్రపంచవ్యాప్తంగా అఖండఖ్యాతి పొందిన తెలుగు భాష మాధుర్యాన్ని నేటితరం విద్యార్థులు గుర్తించాలని కోరారు. ఈ సందర్భంగా డాక్టర్ దీవి హయగ్రీవా చార్యులు మాట్లాడుతూ ప్రజల భాషకు పట్టం కట్టి వ్యవహారిక భాష ఉద్యమానికి నాయకత్వం వహించిన గిడుగు రామ్మూర్తి పంతులు జన్మదినం తెలుగు భాషా దినోత్సవంగా జరుపుకోవడం తెలుగువారికి గర్వకారణం అన్నారు. కరస్పాండెంట్ లక్ష్మీకాంత రెడ్డి మాట్లాడుతూ సామెతలు చమత్కారాలతో తెలుగు భాష విరాజిల్లుతుందని పద్య ప్రక్రియ తెలుగు భాషకు ప్రత్యేకమన్నారు. తెలుగు భాష వైభవానికి తెలుగు వారందరూ కృషి చేయాలన్నారు.అమ్మ ఆత్మీయతను అందించే తెలుగు భాష పట్ల విద్యార్థులు మమకారం పెంచుకోవాలని పాఠశాల ప్రిన్సిపల్ సనత్ కుమార్ తెలిపారు.అన్నెం శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ ఉద్యమ స్ఫూర్తితో తెలుగు భాష వైభవానికి కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు.. భావ ప్రకటనకు మాతృభాష కీలకమన్నారు... తెలుగు పద్యాలు, గేయాలు, నృత్య ప్రదర్శనలతో సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి.వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు... డాక్టర్ హయగ్రీవాచార్యులను, ముఖ్య అతిథులను కరస్పాండెంట్ ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# తెలుగు బాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించిన శ్రీ సంకల్ప పాఠశాల.

-శ్రీ శాంతిని కేతన్ విద్యాసంస్థల అధినేత ఎస్.సుధాకర్.

అమ్మ ఉగ్గు పాలతో నేర్పిన భాష మన తెలుగు భాష అని శ్రీ శాంతిని కేతన్ విద్యా సంస్థల అధినేత సుధాకర్ అన్నారు. మంగళ వారం పట్టణం లోని సంజీవనగర్ లో ఉన్న శ్రీ సంకల్ప్ పాఠశాల లో గిడుగు రామ్మూర్తి పంతులు పుట్టినరోజు సందర్భంగా తెలుగు భాషా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు శ్రీ శాంతినికేతన్ విద్యాసంస్థల చైర్మన్ సుధాకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ ఆంగ్ల మాధ్యమ ప్రభావం ఎక్కువగా ఉన్న నేటి రోజుల్లో తెలుగు భాషా ప్రభావం క్షీణిస్తున్నదని, నేటి విద్యార్థుల జీవితాలు ఆంగ్ల భాష పై ఆధారపడి ఉన్నాయని అన్నారు.. కానీ మానవ జీవితానికి పరభాషల అవసరమైనా మన మాతృభాషను ఎన్నటికీ మరువకూడదని పేర్కొన్నారు. ఇలాంటి తెలుగు భాషోద్యమానికి నడుంబిగించి ఆంధ్ర ప్రజల జీవితాల్లో తెలుగు భాషతో చెరగని ముద్ర గిడుగు రామ్మూర్తి పంతులు వేశారన్నారు.. వక్తగా, ఉపాధ్యాయునిగా, విద్యావేత్తగా ఇంకా ఎనలేని సేవలు చేసిన గిడుగు రామ్మూర్తి పంతులు ను ఈ సందర్భంగా స్మరించుకోవడం అభినందనీయం అన్నారు. అమ్మ ఉగ్గుపాలతో నేర్పిన భాష మన తెలుగు భాష అని మన భావాలను ఎదుటివారితో పంచుకోవడానికి తెలుగు భాష సులభ మార్గమని తెలిపారు.ఈ సందర్భంగా పాఠశాల లో విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అబ్బుర పరిచాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ విజయారెడ్డి , అధ్యాపక బృందం, విద్యార్థులు మరియు తల్లిదండ్రులు పాల్గొని ఈ వేడుకలను విజయవంతం చేశారు



# వైసీపీలోకి సూపర్ స్టార్ ఎంట్రీ?

ఆంధ్ర ప్రగతి అమరావతి ఆగస్టు 29:

టాలీవుడ్ సూపర్ స్టార్ మహేష్ బాబు రాజకీయాల్లోకి ఎంట్రీ ఇవ్వబోతున్నారట. ఇప్పుడీ విషయం సినిమా సర్కిల్స్ హాట్ టాపిక్‌గా మారిందట. సినిమాల్లో ఎంత బిజీగా ఉన్నా మహేష్ బాబు తన సొంతూరైన గుంటూరు జిల్లా బుర్రిపాలేన్ని ఏనాడూ మర్చిపోలేదు. తన సొంత నిధులతో బుర్రిపాలెంలో రహదారులు నిర్మించడం, తన తనయ సితార చేతుల మీదుగా సైకిళ్ల పంపిణీ వంటి ఎన్నో కార్యక్రమాల్లో పాల్గొంటుంటారు. సినీ పరిశ్రమ తనకిచ్చిన స్టార్ డమ్‌తో ప్రజలకేదో చేయాలనే ఆలోచనలో ఉన్న మహేష్ బాబు, రాజకీయాల ద్వారా అయితే సమాజంలో మరింత మంచి చేయవచ్చని భావిస్తున్నారట.



అంతే కాకుండా మహేష్ బాబు సొంత బాబాయి ఆదిశేషగిరిరావు వైసీపీలో కీలక నేతగా కొనసాగుతున్నారు. వైసీపీలోకి చేరేందుకు సిద్ధమైన మహేష్ బాబు అందుకు ముహూర్తాన్నీ నిర్ణయించుకున్నారట. సెప్టెంబర్ 2వ తేదీన వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున నిర్వహించబోతున్న విషయం తెలిసిందే. అదే రోజున లిసీఎం జగన్ సమక్షంలో వైసీపీ కండువా కప్పుకోనున్నట్లు సమాచారం

# ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం మరియు తెలుగు భాష దినోత్సవం.



ఆంధ్ర ప్రగతినంద్యాల ఆగస్టు 29:

జాతీయ క్రీడా దినోత్సవం, తెలుగు భాష దినోత్సవం మంగళవారం స్థానిక కేఎన్ఎం పురపాలక పాఠశాలలో ఘనంగా నిర్వహించారు.

పాఠశాల ప్రధానోపాధ్యాయులు అసదుల్లా అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ జి. రవి కృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ముందుగా ధ్యాన్ చంద్, గిడుగు శ్రీరామ్మూర్తి పంతులు చిత్రపటాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పదవ తరగతి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులు పద్మజా భాయ్, హేమంత్ ,సోమేశ్వరరావు లకు 5000, 3000, 2000 రూపాయల నగదు బహుమతులు పాఠశాల పూర్వ విద్యార్థుల తరపున అందజేశారు. డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు కూడా చాలా ముఖ్యమని అందువలననే జాతీయ క్రీడా దినోత్సవం పురస్కరించుకొని పాఠశాలల్లో క్రీడా పోటీలు నిర్వహించి బహుమతులు అందజేసి క్రీడలను ప్రోత్సహించడం జరుగుతున్నదని తెలిపారు.

తెలుగు భాషను గ్రాంథిక భాష నుండి వాడుక భాషలో తీసుకురావడానికి గిడుగు రామమూర్తి పంతులు విశేష కృషి చేశారని అన్నారు. తెలుగు భాష ఔన్నత్యానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. ప్రధానోపాధ్యాయులు అసదుల్లా మాట్లాడుతూ కేఎన్ఎమ్ పురపాలక పాఠశాలలో మంచి విద్య అందించడం ద్వారా చక్కటి ఫలితాలు సాధిస్తున్నామని వచ్చే సంవత్సరం ఈ పాఠశాల శతాబ్ది ఉత్సవాలు నిర్వహించుకోబోతున్నదని అన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు పివి సుధాకర్ రెడ్డి, సోమేశుల నాగరాజు ,ఉపాధ్యక్షులు కూరా ప్రసాద్ ,పాఠశాల పూర్వ ఉపాధ్యాయులు చిత్తలూరి రాంప్రసాద్, పాఠశాల అధ్యాపక బృందం శివకుమార్, రామసుబ్బారెడ్డి, భారతి, సీతారాం రెడ్డి, తిరుపాలు, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

వైష్ణవి మరియు ఇతర విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

ఈ సందర్భంగా నిర్వహించిన క్రీడ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు.

# ఘనంగా తెలుగు భాషా దినోత్సవం మరియు జాతీయ యువజన క్రీడా దినోత్సవం.



ఆంధ్ర ప్రగతి నంద్యాల ఆగస్టు 29: శ్రీ రామకృష్ణ డిగ్రీ %డ% పీజీ కళాశాల నందు మంగళవారం నాడు జాతీయ క్రీడ దినోత్సవం మరియు తెలుగు భాష దినోత్సవం జరిగింది. ఈ కార్ర్యమానికి ముఖ్య అతిథులుగా కళాశాల చైర్మన్ ప్రొఫెసర్ జి. రామకృష్ణ రెడ్డి గారు, ముఖ్య అతిథిగా హాజరైన అనస్థీషియా డాక్టర్ రవి కృష్ణన్ గారు, ఉపాధ్యాయుని - ఉపాధ్యాయులు, మరియు విద్యార్థులు హాజరయ్యారు. ఈ సంద్భంగా విద్యార్థులు తమదైన శైలిలో ప్రసంగించారు.

కళాశాల చైర్మన్ ప్రొఫెసర్ జి.రామకృష్ణ రెడ్డి గారు మాట్లాడుతూ, ఇప్పటి కాలం విద్యార్థులు తెలుగు భాషను మరిచిపోయి ఆంగ్ల భాష కి అలవాటు పడిపోతున్నారు. అంతేకాకుండా డిగ్రీ స్థాయిలో తెలుగు అవసరం లేదని తీసివేయడం జరగడం అనేది చాలా దురదృష్టకరం అని తెలిపారు. మీరు ఎంత పై స్థాయిలో ఉన్న మన తెలుగు భాషను మర్చిపోకూడదు అని, అప్పటి కాలం శ్రీ కృష్ణదేవరాయలు, దేశ భాష లందు, తెలుగు లెస్స అని చెప్పారు. అలాంటి తెలుగు భాషను ఇవాళ మనం తక్కువ చేసి చూస్తున్నాం అని తెలిపారు. ఇదేవిధంగా రామకృష్ణ కళాశాలలో ఐదు ఏకరాల మైదానం, టెన్నీస్ కోర్టు, షటిల్ కోర్టు, రైఫిల్ షూటింగ్ ఉన్న చాలా మంది విద్యార్థులు సరిగ్గా ఉపయోగించుకోవడం లేదని, కేవలం మన కళాశాలలో 5% విద్యార్థులు మాత్రమే ఉపయోగించుకుంటున్నారు అని తెలిపారు. మన కళాశాల విద్యార్థులు విద్య రంగంలో కాకుండా, క్రీడ రంగంలో కూడా ముందున్నారని తెలిపారు. దానికి ఉదాహరణగా, సౌత్ జోన్ షటిల్ బ్యాడ్మింటన్ లో రెండవ స్థానం రావడం, ఆల్ ఇండియా స్పోర్ట్స్ జోన్ షటిల్ బ్యాడ్మింటన్ లో మూడవ స్థానం రావడం, ఒక విద్యార్థిని చైన కి వెళ్లి ఆడడం మన కళాశాల విద్యార్థులకే సాధ్యమని తెలిపారు. ప్రతి ఒక్క విద్యార్థి చదువు తో పాటు క్రీడలలో కూడా ముందుండాలని ఆకాక్షించారు.

ముఖ్య అతిథిగా విచ్చేసిన డా॥ రవి కృష్ణన్ మాట్లాడుతూ, ధ్యాన్ చంద్ పుట్టిన రోజు సందర్భంగా మనం జాతీయ క్రీడ దినోత్సవం జరుపుకుంటున్నాం అని, ఆయన ఒక హాకీ మాంత్రికుడు అని తెలిపారు. ముఖ్యంగా ఈరోజు ఒలింపిక్ క్రీడలు, కామన్వెల్త్ క్రీడలు, ప్రపంచ కప్, ఆసియా క్రీడలు, ప్రపంచ ఛాంపియన్‌షిప్, మొదలైన అంతర్జాతీయ టోర్నమెంట్‌లలో అత్యుత్తమ సేవలందించిన క్రీడాకారులకు ఈ అవార్డును అందజేస్తారు అని తెలిపారు. అదేవిధంగా గిడుగు రామ్మూర్తి పుట్టిన రోజు సందర్భంగా మనం తెలుగు భాషను జరుపుకుంటున్నాం అని, మన దేశ వ్యాప్తంగా తెలుగు, హిందీ మరియు ఆంగ్ల భాషలు నేర్చుకోవాలని మన విద్య వ్యవస్థ దీని అమల్లోకి తెచ్చారు. క్రమ క్రమంగా మనం ఆంగ్లం బాషాకే ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వడం జరిగిందని తెలిపారు.

జాతీయ క్రీడ దినోత్సవం సందర్భంగా కళాశాల బృందం వారు పోటీలు నిర్వహించడం జరిగింది. విజేతలుగా నిలిచిన వారికి ఉపాధ్యాయుని- ఉపాధ్యాయుల చేత బహుమతులు ఇవ్వడం జరిగింది. కార్యక్రమానికి విచ్చేసిన డా॥ రవి క్రిష్ణకు జి. రామకృష్ణ రెడ్డి చేతుల మీదుగా సన్మానించడం జరిగింది. చివరికి ఈ కార్యక్రమం జాతీయ గేయ ఆలపనతో ముగిసింది.

# జాతీయ క్రీడా దినోత్సవ చెస్ పోటీలు ప్రారంభం.



ఆంధ్రప్రగతినంద్యాల ఆగస్టు 29:

జాతీయ క్రీడా దినోత్సవం పురస్కరించుకుని నంద్యాల జిల్లా చెస్ సంఘం ఆధ్వర్యంలో రామకృష్ణ డిగ్రీ కళాశాల వివేకానంద ఆడిటోరియంలో జిల్లా స్థాయి చెస్ టోర్నమెంట్ మరియు ఎంపిక పోటీలు నిర్వహించారు.

ఈ సందర్భంగా నంద్యాల జిల్లా చెస్ సంఘం అధ్యక్షులు డాక్టర్ జి రవికృష్ణ అధ్యక్షతన జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో రామకృష్ణ విద్యా సంస్థల అధినేత మరియు జిల్లా చెస్ సంఘం చైర్మన్ డాక్టర్ రామకృష్ణారెడ్డి, ఆర్ఎస్ఎస్ ప్రముఖ నాయకులు శ్రీనాథ్ అతిధులుగా పాల్గొని ప్రసంగించారు.

డాక్టర్ జి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా జిల్లా స్థాయి చెస్ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. తమ సహకారం నిరంతరం అందజేస్తామని తెలిపారు. డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ పోటీలలో గెలుపొందిన వారు వచ్చే నెలలో నంద్యాలలో జరగబోయే రాష్ట్రస్థాయి ర్యాంకింగ్ టోర్నమెంట్లో పాల్గొనే నంద్యాల జిల్లా జట్టులో ఉంటారని తెలిపారు. ఆర్ఎస్ఎస్ నాయకులు శ్రీనాథ్ మాట్లాడుతూ చదరంగం మేధోసంపత్తికి సంబంధించిన క్రీడ అని అన్నారు. చదరంగం భారతదేశంలోనే కొట్టడం భారతీయుల మేధాసంపత్తికి నిదర్శనం అని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర చెస్ సంఘం సంయుక్త కార్యదర్శి రామసుబ్బారెడ్డి,లయన్స్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు పి.వీ సుధాకర్ రెడ్డి, సోమేశుల నాగరాజు, ఉపాధ్యక్షులు కూరా ప్రసాద్, ఆర్ఎస్ఎస్ జిల్లా నాయకులు శ్రీనివాస్ , క్రీడాకారుల తల్లిదండ్రులు కోచ్ లు పాల్గొన్నారు. నంద్యాల జిల్లా నలుమూలల ఇంటి దాదాపు 200 మంది పైగా చదరంగం క్రీడాకారులు వివిధ వయసు కేటగిరీలో జరిగిన పోటీలలో పాల్గొన్నారు.



# జాబ్ మేళాతో బహుజనుల అభివృద్ధికి బాటలు వేస్తున్న బీసీవై పార్టీ.

ఆంధ్ర ప్రగతి మహానంది ఆగస్టు 29:

రాష్ట్రంలో ఏ పార్టీ గాని ఏ నాయకుడు గాని చేయలేని విధంగా భారత చైతన్య యువజన పార్టీ రాష్ట్ర అధ్యక్షులు బోడె రామచంద్ర యాదవ్ మంగళగిరిలోని హ్యాపీ రిసార్ట్లో సెప్టెంబర్ 2.3తేదీలలో నిరుద్యోగులకు జాబ్ మేళా ఏర్పాటు చేసి సరి కొత్త వరవడికి శ్రీకారం చుట్టారు. 76 సంవత్సరాల స్వాతంత్రోద్యమం తర్వాత బహుజనుల కోసం బహుజనుల ఆత్మగౌరవం కోసం బోడె రామచంద్ర యాదవ్ తీసుకున్న అసాధారణ నిర్ణయం ఈ రాష్ట్రంలో ఉన్న బూర్జువా దొంగ నా పార్టీలకు కనువిప్పు కలిగేలా ఉందని అలాగే బహుజనుల నిరుద్యోగాన్ని అడ్డుపెట్టుకొని బహుజనుల ఆర్థికమైన సమస్యలను అడ్డుపెట్టుకొని తమ పబ్బం గడుపుకుంటున్న అధికార ప్రతిపక్ష పార్టీలకు బీసీవై పార్టీ జాబ్ మేళా నిర్ణయం చెప్పుతో కొట్టినట్టు ఉందని బీసీవై పార్టీ ఏర్పాటు చేసిన జాబ్ మేళాను నిరుద్యోగ యువతీ యువకులు నంద్యాల జిల్లా వ్యాప్తంగా వినియోగించుకోవాలని ఏపీ బీసీ సంక్షేమ సంఘం నంద్యాల జిల్లా అధ్యక్షులు
వై నాగ శేషు తెలియజేశారు.

జాబ్ మేళాకు వెళ్లదలుచుకునే వారికి ఏపీ బీసీ సంక్షేమ సంఘం సహకారంగా ఉంటుందని ఏవైనా సలహాలు కావాలంటే బీసీ సంక్షేమ సంఘం నంద్యాల జిల్లా కార్యాలయంలో కలవగలరు cell : 9550043745

# ప్రజా అభివృద్ధి వ్యతిరేకులు మోడీ జగన్ లను తరిమికొట్టండి.



ఆంధ్ర ప్రగతి మహానంది ఆగస్టు 29:

దేశంలో నరేంద్ర మోడీ రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి ఇద్దరు ప్రజా అభివృద్ధి వ్యతిరేకులని, కార్పొరేటు అనుకూల శక్తులని వీరిద్దరిని రాష్ట్రం నుండి దేశం నుండి తరిమి కొట్టి రాష్ట్రాన్ని రక్షించాలని దేశాన్ని కాపాడాలని సిపిఐ జిల్లా నాయకులు ఎం.రమేష్ బాబు,భాస్కర్, ప్రభాకర్ లు పిలుపునిచ్చారు. సిపిఐ రాష్ట్ర బస్సుజాత సెప్టెంబర్ ఒకటో తేదీన నంద్యాలకు విచ్చేస్తున్న సందర్భంగా రైతు సదస్సు జయప్రదం చేయాలని మహానంది లో రెండో రోజు జీపు జాత సాగింది.. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం బటన్ నొక్కుడు పేరుతో లక్షల రూపాయలు దోపిడీ చేస్తున్నాడని అభివృద్ధి సంక్షేమాన్ని మరిచి పథకాల పేరుతో కాలయాపన చేస్తున్నాడని వారు విమర్శించారు. రాయలసీమ రైతాంగ అభివృద్ధికి ఒక్క ఎత్తిపోతల కానీ కాల్వకాని తవ్విన చరిత్ర జగన్మోహన్ రెడ్డికి లేదన్నారు. కృష్ణా జలాలను పక్క రాష్ట్ర నేతలు దోచుకుంటుంటే ఈయన చూస్తూ తాడేపల్లికే పరిమితం అయ్యాడాన్నారు.. దేశంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం తొమ్మిది ఏళ్ల పాలనలో మతోన్మాదాన్ని పెంచి పోషిస్తూ పేదలను మరింత పేదలుగా తయారు చేస్తూ కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తుందని వారు విమర్శించారు. భరతమాత అని చెప్పుకునే బిజెపి మణిపూర్లో మహిళలను నగ్నంగా ఊరేగిస్తూ హత్య చేస్తుంటే చూస్తూ ఊరుకొంది తప్ప చర్యలు తీసుకోవడంలో విఫలం చెందిందన్నారు.. దళితులు మైనార్టీలు బడుగు బలహీన వర్గాల పట్ల దాడులు పెట్రేగిపోయాయని బిజెపి పాలిత రాష్ట్రాల్లో అరాచక పాలన కొనసాగుతుందన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ రక్షణకు నడుం బిగించాలని వారు అన్నారు. దేశంలో రైతాంగం ప్రజలు సుభిక్షంగా ఉండాలంటే పరిపాలన మారాలని ఆ వైపున బస్సు జాత నిర్వహిస్తున్నామని ప్రజలు చైతన్యవంతులై ఉద్యమాలకు సిద్ధం కావాలన్నారు సెప్టెంబర్ ఒకటో తేదీన నంద్యాల మున్సిపల్ హల్ లో జరిగే రాష్ట్ర రైతు సదస్సులో రాజకీయ పార్టీల నాయకులు పాల్గొంటున్నారని వారు అన్నారు. కార్యక్రమంలో మహానంది మండల నాయకులు సామేలు, రాజు, నరసింహతో తదితరులు పాల్గొన్నారు.ద

# మల్దకల్ దేవాలయం దర్శించుకున్న ప్రొఫెసర్ శ్రీరాములు

మల్దకల్



ఆదిశిలా క్షేత్రం మల్దకల్ శ్రీ స్వయంభు లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయాన్ని మంగళవారం ప్రొఫెసర్ గాజుల శ్రీరాములు దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరికి ఆలయ అర్చకులు మధుసూదనాచారి, రమేష్, రవి ఘనంగా స్వాగతం పలికి దేవాలయంలో అర్చనలు చేయించారు. అనంతరం పట్వారి అరవిందరావు వారికి శేష వస్త్రంతో ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర రావు, దామ నరేష్ తదితరులు పాల్గొన్నారు. ఎంతో మంది ఉన్నతాధికారులు కావటానికి మార్గదర్శి ఐన మన ఊరి మహనీయుడు శ్రీరాములు సార్ శ్రీగిరి వాసుని దర్శించుకున్నారు.

# జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా గిడుగు వెంకటరామూర్తి జయంతి వేడుకలు.

ఆంధ్రప్రగతి నంద్యాల ఆగస్టు29:
వ్యవహారిక బాషా పితామహుడు గిడుగు. వెంకట రామమూర్తి గారి జన్మదినం సందర్భంగా తెలుగు భాషా దినోత్సవాన్ని జరుపుకుంటున్నము ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ కె.రఘువీర్ రెడ్డి నంద్యాల జిల్లా పోలీస్ కార్యాలయం నందు గిడుగు.వెంకట రామమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.
ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఆగస్టు 29వ తేదీన తెలుగు భాషా దినోత్సవం గా జరుపుకుంటున్నాం దీనికి కారణం గ్రాంధిక భాషను పండితుల వద్దనుండి పామర జనాలకు చేరువేసే దిశగా నిరంతరం కృషి చేసిన తెలుగు భాషోద్యమ స్ఫూర్తి దాత గిడుగు వెంకట రామమూర్తి. ఆయన జయంతిని రాష్ట్ర ప్రభుత్వం తెలుగు భాష దినోత్సవంగా గుర్తించడం జరిగింది.ఈ సందర్భంగా నంద్యాల జిల్లా పోలీస్ కార్యాలయంలో గత వారం రోజుల నుండి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం తెలుగు భాష గొప్పతనాన్ని నలుదిశలా వ్యాప్తి చేసిన గిడుగు. వెంకట రామమూర్తి గారి వారోత్సవాలను జిల్లా పోలీసు కార్యాలయంలో జరుపుకొన్నాము.



తెలుగు భాషాభివృద్ధికి ఆయన చేసిన కృషి అనిర్వచనీయం. ప్రాచీన సంస్కృత భాష జాలం నుంచి విడివడి ప్రాథమిక స్థాయి నుంచి మాతృభాషపై పట్టు సాధించాలని జాతి పటిష్టతలో వ్యవహారిక భాష ప్రధాన పాత్ర వహిస్తుందని దానికి రూపకల్పన చేసిన వ్యక్తి గిడుగు. వెంకట రామమూర్తి పంతులు గారు.
మనకు మన తల్లిదండ్రులు నేర్పినటువంటి మాతృభాషపై మక్కువ పరిజ్ఞానం పెంపొందించుకోవాలని ఇష్టపడి మక్కువతో బుక్ రీడింగ్ అనేది అలవాటు చేసుకోవాలని దానిని మీ పిల్లలకి వచ్చే తరం వారికి మాతృభాషపై అవగాహన కల్పించాలని, మాతృభాషపై అవగాహన కలిగిన వారు ఏ విషయం అయిన సులువుగా అర్థం చేసుకునే వీలు ఉంటుందని, మనం ఎంత ఉన్నత స్థాయిలో ఉన్న తల్లిదండ్రులను మాతృభాషను ఇమరువరాదని జిల్లా ఎస్పీ తెలియజేశారు.
ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ తో పాటు అడిషనల్ ఎస్పీ జి వెంకటరాముడు స్పెషల్ బ్రాంచ్ డిఎస్పి జేవీ సంతోష్, ఏ ఏ ఓ నిజాముద్దీన్,ఆర్ ఐ లు సుధాకర్ ,శ్రీనివాసులు, ఆర్ యస్ఐ లు, స్పెషల్ పార్టీ పోలీసులు,జిల్లా పోలీస్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# చలో హైదరాబాద్ కి బయలుదేరిన IFTU కార్మికులు.

: గద్వాల.
దేశ కార్మిక వర్గం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం %×ఖీఖ% జాతీయ కమిటీ పిలుపు మేరకు ఈరోజు హైదరాబాద్ లోని ఇందిరాపార్క్ వద్ద "మహా ధర్నాకు" గద్వాల జిల్లా నుండి కదిలిన ఐఎఫ్టియు కార్మికులు.ఈ సంధర్భంగా %×ఖీఖ% గద్వాల జిల్లా అధ్యక్షులు గంజిపేట రాజు మాట్లాడుతూ..దేశభక్తి పేరుతో సంపదను లూటీ చేస్తున్న మోడీ ప్రభుత్వ విధానాలను నిరసనగా,ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరం చేయడం అమ్మకానికి పెట్టడంను ఆపాలని,కార్మికులకు సమాన పనికి సమాన వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఈ రోజు29న జరిగే చలో హైదరాబాద్ ఇందిరాపార్క్ మహా ధర్నాను విజయవంతం చేయాలని గంజిపేట రాజు అన్నారు.ఆర్ ఎస్ ఎస్, బీ జే పీ మోడీ ప్రభుత్వం,జాతీయత,దేశభక్తి అని చెపుతూనే ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ పరం చేస్తూ,అమ్మకానికి పెడుతుందని,దేశ సంపదను బడా కార్పోరేట్ సంస్థలు లూటీ చేయడానికి గేట్లు బార్లా తెరిచిందని,కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్,స్కీమ్ వర్కర్ లను పర్మినెంట్ చేయకుండా,శ్రమ దోపిడీకి గురి చేస్తుందని, హమాలీ కార్మికులకు గ్రామపంచాయతీ కార్మికులకు ఆశ వర్కర్ కార్మికులకు ఎలాంటి భద్రత లేకుండా వారితో




ఎట్టిశాకీలు చేయించుకుంటూ నాలుగు లేబర్ కోడ్ లను తెచ్చి కార్మిక వర్గాన్ని నయా వంచనకు గురిచేస్తుందని, ఈ విధానాలకు నిరసనగా,రాష్ట్ర కేసిఆర్ ప్రభుత్వం ఐదు ఇండ్రస్ట్రియల్ ఎంప్లాయీస్ షెడ్యూల్స్ జీ ఓ గెజిట్ లను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ, ఐ ఎఫ్ టి యు జాతీయ కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు, ఈరోజు,ఆగస్టు 29 న,హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద మహా ధర్నాను నిర్వహిస్తున్నామని తెలిపారు.ధర్నాలో అన్ని రంగాల కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. గడిచిన తొమ్మిది సంవత్సరాల మోడీ,కేసీఆర్ పాలన మొత్తం ప్రజా,రైతు,కార్మిక వ్యతిరేక విధానాలనే కొనసాగించిందని,స్వదేశీ విధానాన్ని అమలు చేస్తామని చెప్పిన మోడీ,విదేశీ విధానాన్ని వేగవంతం చేసిందని అన్నారు.
రైతుల సబ్సిడీలు రద్దుచేసిందని,ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు కల్తీ,ఎన్నడూ లేని విధంగా పెట్రోల్,డీజిల్ గ్యాస్, సిలిండర్ ధరలను విపరీతంగా పెంచిందని,సామాన్యులు, మద్యతరగతి,పేదలు, కష్టజీవులు,కార్మికులు పెద్ద ఎత్తున ఆర్థిక భారాలకు గురయ్యారని అన్నారు.
ఈ కార్యక్రమంలో %×ఖీఖ% కార్మికులు వెంకటేష్,గోపి,కోళ్ళ రాజు,శివ,జమ్మన్న,దేవదాసు,మన్యం,రాజ్ కుమార్,ఆకుపోగు వెంకటేష్,రాజు,వెంకటేష్,తదితరులు ఉన్నారు....



**మలిదశ తెలంగాణ ఉద్యమకారుడు కీర్తి.శేషులు పులికల్ దేవన్న గారి కుటుంబానికి 3 లక్షల రూపాయల చెక్కును అందజేసిన అలంపూర్ శాసన సభ్యులు డాక్టర్.వి.యం.అబ్రహం..**

: ఐజ.
మంగళవారం ఐజ మండలం పులికల్ గ్రామానికి చెందిన మలిదశ తెలంగాణ ఉద్యమకారుడు శ్రీ కీర్తి.శేషులు పులికల్ దేవన్నగారు కొన్ని నెలల క్రితం ప్రమాదవశాత్తు చనిపోవడం జరిగింది అట్టి విషయాన్ని సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి సీఎం సహాయ నిది ద్వారా మంజూరు అయిన 3 లక్షల రూపాయల చెక్కును వారి కుటుంబ సభ్యులకు అందజేసిన అలంపూర్ శాసన సభ్యులు డాక్టర్.వి.యం.అబ్రహం గారు.. అంతకు ముందు వారి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు వారి కుటుంబనికి ప్రభుత్వం తరఫున అన్ని విధాలుగా ఆదుకుంటామని తెలిపారు..ఈ సదర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతు..
కొన్ని నెలల క్రితం రోడ్ ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మరణించడం జరిగింది.వారి కుటుంబానికి సీఎం సహాయనిధి ద్వారా సీఎం గారితో మాట్లాడి న్యాయం చేస్తానని హామీ ఇవ్వడం జరిగింది. ఇచ్చిన ప్రకారం 3 లక్షల రూపాయల సీఎం సహాయనిధి ద్వార మంజూరు చేయించి చెక్కును వారి కుటుంబ సభ్యులకు అందజేయడం జరిగింది పేదల పాలిట ఆపన్న హస్తం సీఎం సహాయ నిది మారింది అని ఎంతో మంది నిరుపేదలకు సీఎం సహాయనిధి ద్వారా అండగా నిలుస్తున్న ఘనత సీఎం కెసిఆర్ గారికీ దక్కుతుంది అని అన్నారు..ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు మరియు %దీ=ూ% పార్టీ నాయకులు మరియు అజయ్ అన్న సేవా దళం సభ్యులు మరియు తదితరులు పాల్గొన్నారు.....




**శ్రీ బీచుపల్లి క్షేత్రములు శ్రీ కోదండరామ స్వామి దేవాలయం నందు పవిత్రోత్సవంలో రెండవ రోజున సుప్రభాత సేవ ప్రబంధ పారాయణం జరిగినది...**

: ఎర్రవల్లి.
జోగులాంబ గద్వాల జిల్లా ఇటిక్యాల మండలం శ్రీ బీచుపల్లి పుణ్యక్షేత్రంలో కృష్ణా నది సమీపాన శ్రీ కోదండరామ స్వామి దేవాలయంలో రెండవ రోజున ఉదయం సుప్రభాత సేవ ప్రబంధ పారాయణం మంగళ వాయిద్యాలతో నూతన పవిత్రములతో గ్రామ ప్రదక్షణ అనంతరం యాగశాల ఆరాధనలు పవిత్ర ప్రతిష్ట మూల మంత్రాది హోమములు మూలమూర్తులకు అభిషేకాలు లఘు పూర్ణావతి నివేదన శాత్తుమురై తీర్థ ప్రసాద గోష్టి ఈ కార్యక్రమంలో దేవాలయ సిబ్బంది మరియు శ్రీ నారాయనన్ శిష్య బృందం తిరుపతి వారు నిర్వహించినట్లు ఆలయ మేనేజర్ సురేంద్ర రాజు గారు తెలియజేశారు...

# కరుణామయ గ్రూప్ ఆఫ్ స్కూల్స్‌లో ఘనంగా తెలుగు భాషా దినోత్సవం.

ఆంధ్రప్రగతి నంద్యాల ఆగస్టు29:
నంద్యాల పట్టణంలోని కరుణామయ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ లో ఘనంగా తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహించడం జరిగిందని కరుణామయ విద్యాసంస్థల కరస్పాండెంట్ దండే వెంకట్ నరేష్ తెలిపారు. ఈ కార్యక్రమానికి నంద్యాల పట్టణ సాహితీ, స్రవంతి అధ్యక్షులు శ్రీనివాస మూర్తి ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థినీ విద్యార్థులకు తెలుగు భాష గొప్పతనం గురించి, గిడుగు రామ్మూర్తి సేవలను తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా కరస్పాండెంట్ దండే వెంకట నరేష్ మాట్లాడుతూ గిడుగు రామమూర్తి సేవలను స్మరించుకుంటూ తెలుగు భాషా దినోత్సవాన్ని జరపడం ఆనందంగా ఉందని తెలిపారు. గ్రాంధిక భాషను తెలుగు వాడుక భాషగా చేయడంలో ఆయన ఎంతో కృషి చేశారని తెలిపారు. కరుణామయ విద్యాసంస్థల చైర్మన్ దండే దస్తగిరి మాట్లాడుతూ ఆగస్టు 29 ధ్యాన్ చంద్ జయంతి నీ జాతీయ క్రీడా దినోత్సవంగా జరుపుకుంటున్నామని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులు పద్యాలతో, సామెతలతో, పొడుపు కథలతో, తెలుగు సాహిత్య రంగానికి విశేష కృషిచేసిన కవి పండితుల గురించి తెలుసుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ ఇన్కమ్ టాక్స్ భూషణం, సత్యనారాయణ విద్యార్థిని, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.




# అటవీశాఖ అధికారుల నిర్లక్ష్యం

## - ప్లాంటేషన్లో వృక్షాల నరికివేత



ఆంధ్రప్రగతి రుద్రవరం, ఆగస్టు 29:
అటవీశాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా నీలగిరి ప్లాంటేషన్లో వృక్షాలు నరికివేతకు గురయ్యాయి. రుద్రవరం రేంజి పరిధిలోని రుద్రవరం సెక్షన్ అప్పనపల్లె గ్రామ సమీపంలోని తెలుగు గంగా ప్రధాన కాలువ వద్ద ఉన్న నీలగిరి ప్లాంటేషన్లో కొందరు వ్యక్తులు భారీగా పెరిగిన నీలగిరి వృక్షాలను నరికి దుంగలుగా చేసి అలాగే వదిలేశారు. కొన్ని నీలగిరి వృక్షాలను అక్రమంగా నరికి దుంగలను తరలించుకు వెళ్లారు. అటవీ సంరక్షణలో భాగంగా ప్లాంటేషన్ లోని నీలగిరి వృక్షాలను నరికివేతకు గురి కాకుండా కాపాడాల్సిన అటవీశాఖ అధికారుల సిబ్బంది నిర్లక్ష్యంగా నిద్రమత్తులో జోగుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పదవిశాఖ అధికారులు సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా నీలగిరి ప్లాంటేషన్ లో పలుమార్లు నీలగిరి వృక్షాలు అక్రమంగా నరికి తరలించుకు వెళ్లిన సందర్భాలు అనేకం ఉన్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సంరక్షణ పై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులు సిబ్బందిపై చర్యలు తీసుకొని నీలగిరి వృక్షాలు అంతరించిపోకుండా కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# బాల అకాడమీ పాఠశాలలో ఘనంగా జరిగిన మాతృభాషా దినోత్సవ వేడుకలు

ఆంధ్రప్రగతి నంద్యాల ఆగస్టు29:
నంద్యాల పట్టనంలోని పార్క్ రోడ్డు సమీపంలో గల పాఠశాల లో ఆగస్టు 29 అనగా మంగళవారమున పాఠశాలలో ఘనంగా మాతృభాష దినోత్సవపు వేడుకలను జరుపుకోవడం జరిగినది ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శాలక రెస్పాండెంట్ ఎంజీవి రవీంద్రనాథ్ ప్రిన్సిపల్ శ్రీమతి మాధవి లత మరియు దీవి హయగ్రీవాచార్యులు, అన్నెం శ్రీనివాస రెడ్డి, రామ మోహన్ శర్మ,డాక్టర్ గెలివి సహదేవుడు, పి.వి.సుధాకర్ రెడ్డి, సోమేసుల నాగరాజు విచ్చేశారు ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులు మాట్లాడుతూ అమ్మతో అనుబంధం తెలుగు భాషతో అనుబంధం జీవితాంతం ఉంటాయి. దేశభాషలందు తెలుగు లెస్స అని కీర్తించబడిన తెలుగును మాతృభాషగా పొందిన మనము చాలా గర్వించదగిన విషయము వ్యవహారిక భాషా ఉద్యమ నాయకుడైన గిడుగు వెంకట రామమూర్తి గారు ఆగస్టు 29 1863న శ్రీకాకుళంలోని పర్వతాలపేట గ్రామంలో జన్మించారు ప్రపంచీకరణ వలన ప్రస్తుతం కేవలం 27% మంది పిల్లలు మాత్రమే తెలుగు మాత్యములో చదువుతున్నారని తెలుస్తున్నది గ్రాంథిక భాషా స్థానంలో వ్యవహారిక భాషను తీసుకురావడానికి గిడుగు వెంకట రామమూర్తి చేసిన విశేష సేవను మరియు మన తెలుగు భాషను మనం ఎలా రక్షించుకోవాలో కాపాడుకోవాలో మరియు తెలుగు భాష గొప్పతనాన్ని ప్రాముఖ్యతను పిల్లలకు అర్థమయ్యేలా విధంగా చక్కగా వివరించడం జరిగినది.పాటశాల ఈ కార్యక్రమ ముఖ్య అతిథులనుపాటశాల యాజమన్యం వారు సన్మానించడం జరిగింది పాఠశాల చిన్నారులు భారతమాత తెలుగు తల్లి వేసాలతోమరియు కవుల వేసలతో ఆదరిని ఆకట్టుకున్నారు.
ఈ కార్యక్రమం లో పాఠశాల కరస్పాండ్ ఎంజీవి రవీంద్రనాథ్, ప్రిన్సిపల్ మాధవి లత మరియు ముఖ్య అతిథులు ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

